క్లుప్తంగా...

అనంత పద్మనాభస్వామికి మంత్రి హరీశ్‌రావు పూజలు



పుప్పాలగూడ అనంత పద్మనాభస్వామి సన్నిధిలో మంత్రి హరీశ్‌రావు

మణికొండ: శ్రీ అనంత పద్మనాభస్వామిని రాష్ట్ర మంత్రి టి.హరీశ్‌రావు శుక్రవారం దర్శించుకున్నారు. మణికొండ మున్సిపాలిటీ, పుప్పాలగూడలోని దేవాలయంలో గురువారం నుంచి కొనసాగుతున్న వ్రత పూజల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన సుదర్శన హోమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

నీటి నమూనాల సేకరణ



రాజేంద్రనగర్: గణేష్ నిమజ్జనం ముగియడంతో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని చెరువులు, కుంటల నీటి నమునాలను సేకరించారు. శుక్రవారం మధ్యాహ్నం పత్తికుంట, పల్లె చెరువులోని నీటి నమునాలను సిబ్బంది సేకరించారు. అంతకుముందే చెరువులోని నీటిని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరీక్షించారు. ప్రస్తుతం గణేష్ ప్రతిమల నిమజ్జనం పూర్తి కావడంతో శుక్రవారం మరోసారి నీటి నమునాలను సేకరించారు. వీటిని పరిశీలించి గణేష్ నిమజ్జనానికి ముందు అనంతరం నీటి కాలుష్యంపై ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యే గెలుపే ధ్యేయం



శంషాబాద్: రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఘన విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని కిషన్‌గూడ, తొండుపల్లి, ఊటిపల్లి బీఆర్ఎస్ నేతలు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను ఆయన ఇంటి వద్ద కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం ద్వారా స్థానిక ప్రజలు అనేక సంక్షేమ పథకాల్లో లబ్ధిదారులుగా ఉన్నారన్నారు. ఓటర్లంతా బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు సన్నద్ధంగా ఉన్నారన్నారు. పారెపల్లి శ్రీనివాస్‌గౌడ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ డి. వెంకటేష్‌గౌడ్ తదితరులున్నారు.

మందుబాబులకు జైలు

మణికొండ: మద్యం మత్తులో వాహనాలు నడిపిన ఇద్దరికి రాజేంద్రనగర్ కోర్టు జరిమానా, జైలు శిక్షలు విధించింది. నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. షేక్ సమీర్, ప్రేమానందం అనే వ్యక్తులు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసుల తనిఖీలలో పట్టుబడ్డారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరు పరచగా షేక్ సమీర్‌కు రూ.4వేల జరిమానా, 5 రోజుల జైలు శిక్ష, ప్రేమానందంకు రూ.4500 జరిమానా, 3 రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పిందన్నారు. ప్రతి రోజు రోడ్లపై డ్రంక్, డ్రైవ్ తనిఖీలను నిర్వహిస్తున్నామని, మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని ఆయన సూచించారు.

ముమ్మరంగా వ్యర్థాల తొలగింపు

రాజేంద్రనగర్: గణేష్ నిమజ్జనం ముగియడంతో వ్యర్థాల తొలగింపు ప్రక్రియను జీహెచ్ఎంసీ ముమ్మరం చేసింది. గురువారం రాత్రి నుంచే యుద్ధ ప్రతిపాదికన ప్రత్యేక సిబ్బందిని నియమించి చెరువులు, కుంటలతో పాటు ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్త చెదారాలను తొలగించారు. పత్తికుంట, మీరాలం, పల్లె చెరువులో వేసిన గణనాథుల పూజా సామాగ్రితో పాటు కట్టెలు, సీకులు తదితర వస్తువులను జేసీబీల సహాయంతో తొలగించారు. 10 ట్రక్కుల్లో వీటిని తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. రోడ్లపై చెత్త చెదారాలను తొలగించేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేయడంతో శుక్రవారం మధ్యాహ్ననికి ప్రధాన రహదారులతో పాటు చెరువులు, కుంటలతో నూటికి నూరు శాతం పరిశుభ్రం చేసినట్లు సర్కిల్ ఉప కమిషనర్ రవి కుమార్ పేర్కొన్నారు.

సమన్వయంతోనే నిమజ్జనం విజయవంతం

అత్తాపూర్: వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసి గణేష్ నిమజ్జనాన్ని విజయవంతం చేశారని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లా రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో గణేష్ నవరాత్రుల విజయవంతానికి సహకరించిన శంషాబాద్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఏసీపీ గంగాధర్, సీఐ నాగేంద్రబాబు, ఎస్సై పులి యాదగిరి, డీసీ రవి కుమార్, ఎస్సై మౌనిక రెడ్డి, ట్రాఫిక్ సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లతో పాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు. నిమజ్జనాన్ని ప్రశాంతంగా ముగిసేందుకు కృషి చేసిన పోలీసు సిబ్బందిని శుక్రవారం ఆయన ఘనంగా సన్మానించారు.



మంచిరేవుల వినాయక ఊరేగింపులో పాల్గొన్న నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్



శుక్రవారం తెల్లవారు జామున నెక్నాంపూర్‌లో కొనసాగుతున్న నిమజ్జనాలు



ఖానాపూర్ వరసిద్ధి వినాయక లడ్డూను రూ.10.10 లక్షలకు దక్కించుకున్న డాకూరి శివరాజ్

నిమజ్జన వేళ.. ఆనంద హేల

మణికొండ: వినాయక ఊరేగింపులు, లడ్డూల వేలం పాటలు, నిమజ్జనాలు శుక్రవారం తెల్లవారు జాము వరకు కొనసాగాయి. గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో నిమజ్జన ప్రక్రియలో జాప్యం జరిగింది. లడ్డూల వేలం పాటలను నిర్వహించిన అనంతరం విగ్రహాలను హుస్సేన్‌సాగర్, నెక్నాంపూర్, దర్గా, ఖానాపూర్, కోకాపేట చెరువులకు ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.



అలకాపూర్‌లో వినాయకుని లడ్డూను రూ. రూ.10 లక్షలకు కైవసం చేసుకున్న సురేష్



దివ్యజ్యోతి యూత్ వినాయకుని లడ్డూను రూ.7.50లక్షలకు దక్కించుకున్న రాంచందర్‌గౌడ్



అలకాపూర్ ఎంజీ పార్కు వినాయకుని లడ్డూను రూ.4.91లక్షలకు దక్కించుకున్న పద్మ శ్రీనివాస్‌రెడ్డి



మణికొండ గార్డెన్ కాలనీ వినాయకుని లడ్డూను రూ. 2.41లక్షలకు దక్కించుకున్న సైలేష్



వివేకానంద యూత్ లడ్డూను రూ.7.11 లక్షలకు కైవసం చేసుకున్న తలారి విట్టలయ్య



శివాజీనగర్ వినాయకుని లడ్డూను రూ.1.74లక్షలకు దక్కించుకున్న మహేష్



శ్రీ మణికంఠ భక్త సమాజం గణనాథుని లడ్డును సొంతం చేసుకున్న లాజీజ్ మండి నిర్వాహకులు



వివేకానంద కాలనీలో లడ్డూను దక్కించుకున్న జెడ్పీటీసీ నీరటి తన్వీరాజు



కోకాపేటలో లడ్డూను రూ.12 లక్షలకు దక్కించుకున్న సాయికాంత్

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

మణికొండ: ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. డిమాండ్‌ల సాధనలో భాగంగా ఆశా వర్కర్లు ఈనెల 25న నుంచి చేపట్టిన నిరవధిక సమ్మెకు శుక్రవారం ఆయన నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా జీత భత్యాలను పెంచాల్సిన బాధ్యతను ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. ఆశా వర్కర్లకు రూ.18వేల జీతంతో పాటు ప్రమాద బీమా కల్పించాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌గా రూ. 5లక్షలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్, కౌన్సిలర్ ఉషారాణి, నరేష్, నాయకులు లంకల పాపిరెడ్డి, డి.కిరణ్, నవీన్ కుమార్, గండయ్య, యాదగిరి, ప్రదీప్, కిషన్, రవవి, ప్రకాశ్‌ముదిరాజ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల భిక్షాటనకు మద్దతు...

గత 19 రోజులుగా తమ డిమాండ్ల సాధనకు నిరవధిక సమ్మె పట్టిన అంగన్‌వాడీ టీచర్‌ల భిక్షాటన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ మద్దతు తెలిపారు. శుక్రవారం నార్సింగిలో శేరిలింగంపల్లి ప్రాజెక్టు అంగన్‌వాడీలు మున్సిపల్ కేంద్రంలో భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ అనునిత్యం ప్రజలకు సేవ చేసే అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్‌ల గోడును ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఉషారాణి, నాయకులు పాపిరెడ్డి, రేఖాదేవి, సుగుణమ్మ, అంగన్‌వాడీ టీచర్ల సంఘం మండల అధ్యక్షురాలు సుధారాణి, శేరిలింగంపల్లి మండలం అధ్యక్షురాలు నాగమణి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షురాలు మాదవి, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షురాలు శమీంలతో పాటు పెద్ద ఎత్తున అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ టీచర్ల భిక్షాటనలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఆహారాన్ని వృథా చేయొద్దు

మణికొండ: ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది సమయానికి ఆహారం దొరక్క ఇబ్బంది పడుతున్నారని, అలాంటి ఆహారాన్ని వృథా చేయరాదని నార్సింగి మున్సిపల్ కమిషనర్ బి.సురేందర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆయన ఇండియన్ స్వచ్ఛత లీగ్‌లో భాగంగా స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి హోటల్ ముందు ఆహారాన్ని వృథా చేయవద్దని సూచిస్తూ స్టిక్కర్‌లను అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన డబ్బులు పెట్టి మనం ఆహారం కొనుక్కుంటున్నా, దానిని వృథా చేసే అధికారం మనకు లేదన్నారు. ఆ విషయాన్ని ప్రతి ఒక్కరు దృష్టిలో ఉంచుకుని అవసరమైన మేరకే కొనుగోలు చేయాలన్నారు. హోటళ్ల యజమానులు సైతం వృథా అవుతున్న ఆహారాన్ని సమీపంలో అవసరం ఉన్న వారికి పంచి పెట్టాలని సూచించారు.

వేస్ట్ టు వండర్ అందరికీ స్ఫూర్తి...

మనం ఎన్నో వస్తువులను పనికి రావని వృథాగా పడవేస్తున్నామని, వాటిని వినియోగించి ఎన్నో కొత్త వస్తువులను తయారు చేసి ఎంతో మంది అబ్బుర పరుస్తున్నారని, అలాంటి వారిని మనం స్ఫూర్తిగా తీసుకోవాలని నార్సింగి కమిషనర్ సురేందర్‌రెడ్డి అన్నారు. వేస్ట్ టు వండర్ పోటీలలో పాల్గొనేందుకు కొందరు ముందుకు వచ్చి తాము తయారు చేసిన వస్తువులను శుక్రవారం కమిషనర్‌కు చూపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించి రాబోయే రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలను మరింత మందికి నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యోగేష్, డీఈ నరసింహారాజు, శానిటేషన్ ఇన్‌చార్జి లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.



హోటళ్లలో ఆహార పొదుపుపై స్టిక్కర్లు అతికిస్తున్న మున్సిపల్ అధికారులు

నాగుల నరేందర్ ఆధ్వర్యంలో అన్నదానం

రాజేంద్రనగర్: గణేష్ నిమజ్జనానికి తరలివచ్చిన భక్తులతో పాటు వివిధ విభాగాల సిబ్బందికి పత్తికుంట వద్ద బండ్లగూడ అభ్యుదయనగర్‌కు చెందిన నాగుల నరేందర్ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి 10 గంటల నుంచి శుక్రవారం తెల్లవారుజామున 6 గంటల వరకు అన్నదానం కొనసాగింది. నరేందర్ మాట్లాడుతూ... తమ ప్రాంతంలోని గణనాథులను 9వ రోజు నిమజ్జనానికి పత్తికుంటకు తరలించామన్నారు. అర్ధరాత్రి కావడంతో నిమజ్జనానికి వచ్చిన వారు ఆకలికి ఇబ్బందులు పడ్డారని.. వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తూ ఆకలితో ఉండటాన్ని చూశానన్నారు. దీంతో తాను 11వ రోజు సామూహిక నిమజ్జనం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గణేష్ మండపాలతో పాటు ఊరేగింపులో ప్రసాదాన్ని అందించడం, అన్నదానం చేయడం సర్వసాధారణమన్నారు. అర్ధరాత్రి సమయంలో అన్నదానం ద్వారా నలుగురి ఆకలి తీర్చేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రాజేంద్రనగర్ గణేష్ ఉత్సవ సమితితో పాటు పోలీసులు, స్థానికులు, మండపాల నిర్వాహకులు నరేందర్‌ను అభినందించారు.



క్రైం కార్నర్..

బిల్ కలెక్టర్‌పై దాడి

రాజేంద్రనగర్: విద్యుత్ బిల్లును చెల్లించాలన్నందుకు బిల్ కలెక్టర్‌పై నలుగురు యువకులు ముకుమ్మడిగా దాడికి పాల్పడిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. హిమాయత్‌సాగర్ సబ్ స్టేషన్‌లో బి.సాయి ప్రసాద్ బిల్లు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం సాయంత్రం సన్‌సిటీ పీ అండ్ టీ కాలనీ ప్రాంతంలోని రజీముద్దీన్ ఇంటికి వెళ్లి కరెంట్ బిల్లు చెల్లించాలని కోరాడు. రెండు నెలల బిల్లు రూ.4 వేల బకాయిలు ఉన్నట్లు తెలిపాడు. సదరు ఇంట్లోని గదులను యజమాని అద్దెకు ఇచ్చి నగరంలో నివాసం ఉంటున్నాడు. బిల్లు చెల్లించని పక్షంలో కరెంట్ కనెక్షన్ తొలగిస్తామని చెప్పడంతో ఆగ్రహానికి లోనైన సదరు యువకులు అతడిపై దాడి చేశారు. దీంతో తల, ఛాతి, కంటిపై తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు ప్రసాద్ దాడిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. అనంతరం రాజేంద్రనగర్ పోలీసులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

శంషాబాద్ రూరల్: పవర్ రూం వద్ద ఎర్తింగ్ గుంత తీస్తుండగా.. భూమిలో ఉన్న 11 కేవీ కేబుల్‌కు గడ్డపార తగిలి విద్యుదాఘాతంతో కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని ముచ్చింతల్ శివారులోని శ్రీరామనగరంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన పోలాకి నందేష(51) కుటుంబంతో సహా నగరానికి వలసవచ్చి కూకట్‌పల్లి ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 27న మేస్త్రీ కృష్ణతో కలిసి అతను ముచ్చింతల్‌లోని జీవా ప్రాంగణంలో పనికి వచ్చాడు. అక్కడ ఉన్న పవర్ రూం వద్ద ఎర్తింగ్ కోసం గుంత తీస్తుండగా.. భూమిలోంచి ఏర్పాటు చేసిన 11 కేవీ విద్యుత్ తీగకు పార తగిలి కరెంటు షాక్ తగిలింది. అతడిని సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

శంషాబాద్ రూరల్: ఇంటి నుంచి బయటకు వెళ్లి వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రామంజాపూర్ పంచాయతీ అనుబంధ గ్రామం బోటిగూడ వాసి తోగరి జంగయ్య(48) ఈ నెల 27న తెల్లవారు జామున ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం గాలించినా ఆచూకీ తెలియక పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్
- రూ. 5.75 కోట్లతో మున్సిపల్ భవనానికి శంకుస్థాపన

శంషాబాద్: నూతన పురపాలక భవనంతో పట్టణ ప్రజలకు మరింత మెరుగైన సేవలందుతాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని సింప్లెక్ సమీపంలో హెచ్ఎండీఏ కేటాయించిన స్థలంలో రూ.5.75 కోట్లతో మున్సిపల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పట్టణ ప్రగతిలో శంషాబాద్ ఆదర్శవంగా నిలుస్తోందన్నారు. ఉద్యోగులు, ప్రజలకు సౌలభ్యంగా ఉండేందుకు నూతన భవన నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. సమీపంలోనే వెజ్‌నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్‌యాదవ్, నార్సింగి ఏఎంసీచైర్మన్ వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్లు మేకల వెంకటేష్, అశోక్, అజయ్, ప్రవీణ్‌గౌడ్, రేఖ, విజయలక్ష్మీ, అమృత, భాగ్యలక్ష్మీ, భారతమ్మ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్. గణేష్‌గుప్తా, మండల అధ్యక్షుడు కె. చంద్రారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

కుట్టుమిషన్ల పంపిణీ..

మైనార్టీ కార్పొరేషన్ ద్వారా పట్టణంలోని ఆయా వార్డుల లబ్ధిదారులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కుట్టుమిషన్లను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జహంగీర్‌ఖాన్, మస్రత్ జా తదితరులు పాల్గొన్నారు.



'హాథ్‌సే హాథ్ జోడో'ను విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు

మణికొండ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అడుగుజాడల్లో కాంగ్రెస్ పార్టీ లక్ష్యాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకునే నిమిత్తం అక్టోబర్ 2న నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించనున్న హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్ అధ్యక్షతన నార్సింగి పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టడంతో పాటు రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవటమే ధ్యేయంగా నాయకులు పనిచేయాలన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించేందుకు సిద్ధంగా ఉన్నారని, వారిని కలిసి మన బలాన్ని మరింత పెంచుకోవాలన్నారు. ఇటీవల తుక్కుగూడ విజయభేరి సభలో సోనియా గాంధీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రజలకు చేర్చాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డి. కిరణ్, డి. నవీన్‌కుమార్, గండయ్య, యాదగిరి, పాపిరెడ్డి, ఉషారాణి, నరేష్, ప్రకాష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బండ్లగూడ: ప్రజలు తమ ఇంటితో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ పద్మావతి పాపయ్యయాదవ్ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2023 స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్ తిరుమల గార్డెన్ కాలనీలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ ప్రజలకు అవగాహన కల్పించారు. కాలనీలో ర్యాలీ చేపట్టి రోడ్లకు ఇరువైపుల, ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలు చెత్తను రోడ్లకు ఇరువైపుల, ఖాళీ ప్రదేశాల్లో వేయ రాదన్నారు. ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు చెత్తను అందించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. తడి,పొడి చెత్తను వేర్వేరుగా చేసి కార్మికులకు అందించాలన్నారు. కాలనీ వాసులంతా స్వచ్ఛ సర్వేక్షన్‌లో తమ వంతు పాత్ర వహించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాపయ్యయాదవ్, వార్డు అధికారి ఇమ్రాన్, కాలనీ వాసులు వేణు, హరినాథ్‌గౌడ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ పద్మావతి



ఎం.ఎస్ స్వామినాథన్‌కు ఘన నివాళి

ఏజీవర్సిటీ: దేశంలో ఎవరూ ఆకలితో అలమటించరాదన్న లక్ష్యంతో జీవితాంతం పరిశోధనలు చేసిన మహనీయుడు ప్రొఫెసర్ ఎం.ఎస్ స్వామినాథన్ అని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, నారమ్స్‌లో హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వ్యవసాయంలో చేసిన సేవలను కొనియాడారు.

కొనసాగుతున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమ్మె

శంషాబాద్: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్నం భోజన కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరింది. తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగిన ఆందోళనలో కార్మికుల సంఘం నాయకులు విక్రమ్ మాట్లాడుతూ. కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్‌సౌకర్యాలతో పాటు ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం భోజన మెనూ బిల్లులను పెంచాలన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొన సాగుతుందన్నారు.



సమ్మెలో పాల్గొన్న మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు



శంకరాపురంలో విద్యార్థుల ర్యాలీ

గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం

శంషాబాద్ రూరల్: 'మేరీ దేశ్.. మేరీ మాటి' కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా నిర్వహించారు. శంకరాపురం, పెద్దగోల్కొండ, చిన్నగోల్కొండ తదితర పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో స్వచ్ఛ భారత్ చేపట్టారు. జాతీయ జెండాలతో ఇంటింటికి వెళ్లి మట్టి సేకరించారు. గ్రామాల్లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు మహేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, పద్మావతి అనంతరెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దగోల్కొండలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సర్పంచ్